జీఎస్టీ వసూళ్లు 1.84 లక్షల కోట్లు

గతంతో పోల్చితే ఫిబ్రవరిలో 9.1 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 1: జీఎస్టీ వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో రూ.1.84 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే 9.1 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. దేశీయ వినిమయం పుంజుకోవడం, ఆర్థిక రంగం తిరిగి వృద్ధి బాట పట్టడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతునాయని వెల్లడించింది. గత నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.35,204 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,704 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.90,870 కోట్లు, పరిహారం సెస్ రూపంలో రూ.13,868 కోట్లు వచ్చాయని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లలో దేశీయంగా వచ్చిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.2 శాతం ఎగబాకి రూ.1.42 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను ద్వారా రూ.41,702 కోట్లు సమకూరాయి. అలాగే రూ.20,889 కోట్ల పన్నును రిఫండ్ రూపంలో చెల్లించింది. ప్రస్తుత సంవత్సరం తొలి నెల జనవరిలో రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. దీనిపై ఈవై ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుండడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శణమని, అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పటికీ పన్ను వసూళ్లు ఇంచుమించు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ర్టాల్లో జీఎస్టీ వసూళ్లు 10 శాతం నుంచి 20 శాతం వరకు అధికమవగా, అలాగే తెలంగాణతోపాటు గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ర్టాల్లో 1 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగాయి.

టెస్లాపై ఆశలు వదులుకున్నట్టేనా?

తీవ్రంగా పోటీపడుతున్న వివిధ రాష్ర్టాలు

పట్టించుకోని తెలంగాణ సర్కారు

టెస్లా కోసం గతంలో కృషిచేసిన కేటీఆర్

టెస్లా కారుతో కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆ పెట్టుబడిని రాబట్టేందుకు పలు రాష్ర్టాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఉచిత భూములు, రకరకాల ప్రోత్సాహకాల ఆశ చూపడంతోపాటు తమ రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను ఎత్తిచూపుతూ ఎలాగైన పరిశ్రమను దక్కించుకొనేందుకు ఎవరి మార్గాల్లో వారు ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. టెస్లా ప్లాంటు కోసం రాష్ట్ర సర్కారు అవసరమైన మేరకు ప్రయత్నాలు చేయకపోవడమే ఈ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నది.

టెస్లా కంపెనీని ఆకర్షించేందుకు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, కర్ణాటక, తెలంగాణ సైతం రేసులో ఉన్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఇప్పటికే అనేక ఆటోమొబైల్ పరిశ్రమలు కొనసాగుతుండటం వాటికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే పలు ప్రముఖ కార్ల తయారీ కంపెనీలు ఈ రాష్ర్టాల్లో తమ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు చేస్తున్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ర్టాలకు ఐటీ పరిశ్రమలు అధికంగా ఉండటం కొంత అనుకూలాంశం కాగా, ఈ రెండు కాంగ్రెస్ పాలిత రాష్ర్టాలు కావడం ప్రతికూలాంశమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. పోటీలో ఉన్న రాష్ర్టాల్లో తెలంగాణ మినహా అన్నింటికీ ఓడరేవు ఉంది. దీంతో ఎగుమతి, దిగుమతులకు ఈ రాష్ర్టాలు అనుకూలంగా ఉన్నాయి. అన్నిటికి మించి మన రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో టెస్లాతో సంప్రదింపులు జరిపినప్పటికీ అనంతరం ఆ ప్రయత్నాలను కొనసాగించకుండా వదిలేసిందని అంటున్నారు. ముఖ్యంగా ఓడరేవు లేకపోవడం, ఎన్డీఏ కూటమిలోని రాష్ర్టాలతో మనం పోటీ పడే అవకాశం లేదనే భావన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా, దాదాపు నాలుగేండ్ల క్రితం టెస్లా కార్ల తయారీ కంపెనీ భారత్‌కు వస్తున్నట్టు సంకేతాలు వెలువడిన వెంటనే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ దాన్ని తెలంగాణకు వచ్చే విధంగా తీవ్రంగా కృషిచేశారు. నిరంతరం కంపెనీ వర్గాలతో సంప్రదింపులు జరపడమే కాకుండా ఇతర రాష్ర్టాలను తలదన్నే విధంగా తాము ప్రోత్సాహకాలు ఇస్తామని కంపెనీ వర్గాలకు సమాచారం అందించారు. దీంతో తెలంగాణ గట్టి పోటీదారుగా ఎదగడమే కాకుండా టెస్లా భారత్‌కు వస్తే అది తెలంగాణలో ఏర్పాటు ఖాయమనే ప్రచారం అప్పట్లో జరిగింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో అంచనాలు తారుమారయ్యాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సుంకాలతోపాటు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన సహకారంపై ఆయన లేవనెత్తిన అంశాలకు ప్రధాని సానుకూలంగా స్పందించడంతో టెస్లా కంపెనీ భారత్ రాకకు మార్గం సుగమమైంది. అంతేకాదు, ఇప్పటికే తమకు అవసరమైన ఉద్యోగుల నియామకం కూడా టెస్లా చేపట్టింది. సుమారు 500మిలియన్ డాలర్లతో మొదటి దశ పెట్టుబడితో ప్లాంటు ఏర్పాటునకు టెస్లా సిద్ధమవుతున్నది.

వాహన అమ్మకాలు అంతంతే

న్యూఢిల్లీ, మార్చి 1: వాహన ఉత్పత్తి సంస్థలకు ఫిబ్రవరి నెల షాకిచ్చింది. ధరలను పెంచుతూ వాహన ఉత్పత్తి సంస్థలు తీసుకున్న నిర్ణయంతో కొనుగోలుదారులు వెనుకంజవేశారు. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అమ్మకాలు స్వల్పంగా పెరరగా.. హ్యుందాయ్, టాటా మోటర్స్ సేల్స్ భారీగా తగ్గాయి. వాహనాలకు డిమాండ్ పడిపోవడం వల్లనే తగ్గాయని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు, మహీంద్రా, టయోటా కిర్లోస్కర్‌లు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో పన్ను సంస్కరణలు, లిక్విడిటీని పెంచడానికి తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో డిమాండ్‌ను పెంచుతాయన్న విశ్వాసాన్ని హ్యుందాయ్ మోటర్ సీఈవో తరుణ్ గార్గ్ వ్యక్తంచేశారు.

ఫిబ్రవరిలో వాహన విక్రయాలు

సంస్థ	2025	2024	వృద్ధి
మారుతి	1,99,400	1,97,471	స్వల్పంగా
హ్యుందాయ్	58,727	60,501	-3
మహీంద్రా	83,702	72,923	15
టయోటా	28,414	25,220	13
టాటా మోటార్స్	79,344	86,406	-8
కియా ఇండియా	25,026	20,200	24
హోండా కార్స్	10,323	13,078	-21

ఎన్టీపీసీ దూకుడు

న్యూఢిల్లీ: విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 400 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. కేవలం ఈ మైలురాయికి చేరుకోవడానికి సంస్థ 335 రోజులు పట్టింది. అంతక్రితం ఏడాది కంటే 12 రోజులు ముందుగానే ఈ మైలురాయికి చేరుకోవడం విశేషం. 2023-24లో మార్చి 13న ఈ కీలక మైలురాయికి చేరుకున్నది. దేశీయంగా వినియోగిస్తున్న విద్యుత్‌లో నాలుగోవంతు సంస్థ ఉత్పత్తి చేస్తున్నదే కావడం విశేషం. ప్రస్తుతం సంస్థ 77 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగివుండగా, మరో 29.5 గిగావాట్ల విద్యుత్ యూనిట్లు నిర్మాణదశలో ఉన్నాయి.

ఎన్ఎండీసీ ఉత్పత్తి హైజంప్

హైదరాబాద్, మార్చి 1: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఎన్ఎండీసీ ఆశాజనక పనితీరు కనబరిచింది. ఫిబ్రవరి నెలలో సంస్థ 4.62 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 3.98 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన ఖనిజంతో పోలిస్తే 18 శాతం వృద్ధిని కనబరిచినట్లు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఖనిజాన్ని ఉత్పత్తి చేయడం కూడా కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సంస్థ 40.49 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 40.20 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. వచ్చే ఏడాది నూతన గనులు అందుబాటులోకి వస్తుండటంతో ఖనిజ ఉత్పత్తి మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు.

ఎంఎస్ఎంఈల మనుగడ ప్రశ్నార్థకం

- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మారాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈలు మారాలని, లేదంటే రాబోయే రోజుల్లో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ(ఏఐ) యుగంలోనూ పాత ఆలోచనలతో సంప్రదాయబద్ధంగా ముందుకెళ్తే తప్పా మనగడ ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని, ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు ఈ విషయంలో అప్రమత్తంగా, ప్రజలు కోరుకుంటున్న విధంగా కొత్తగా ఆలోచించాలని ఆయన సూచించారు. ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 'సమ్మిట్ ఆన్ ఫ్యూచర్-రెడీ ఇండస్ట్రీ ట్రాన్సఫర్మేషన్: ఇన్నోవేటింగ్ ఫర్ గ్రోత్ ఎఫిషియన్సీ అండ్ సెక్యూరిటీ(గ్రోథ్ ఎక్స్2025)' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టెక్నాలజీ రోజురోజుకి కొత్త పుంతలు తొక్కుతున్నదని, ముఖ్యంగా ఏఐ అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి..అలాగే అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచన తీరు మారాలని ఆయన పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు ఏఐ, క్వాంటమ్, మెషిన్ లెర్నింగ్ తదితర అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను చూపొంచవచ్చని, ఆ దిశగా ఆవిష్కర్తలు కొత్తగా ఆలోచించాలని కోరారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ఇతర రాష్ర్టాలకు ధీటుగా తెలంగాణ అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నదని, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధి రేటు 17.98 శాతం కాగా జాతీయ సగటు 8 శాతం మాత్రమేనని, ఐటీ రంగంలో తెలంగాణ సత్తా ఏంటో చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి అన్నారు.

6 నుంచి చర్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో

ఈ నెల 6 నుంచి 8 వరకు చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2025 ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 106 స్టాల్స్‌ను నెలకొల్పుతున్నట్లు, వాటిలో వివిధ పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నట్లు వారు చెప్పారు.

అల్ట్రాటెక్‌లో కేశోరాం విలీనం

పాలకుర్తి, మార్చి 1: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌లో బీకే బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ విలీనమయ్యాయి. ఇందుకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వద్ద ఉన్న యూనిట్‌లో ఇందుకు సంబంధించి అధికారిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఉత్తర తెలంగాణలోని బసంత్‌నగర్‌లో బీకే బిర్లా సిమెంట్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆతర్వాతి క్రమంలో ఇక్కడే కేశోరాం సిమెంట్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం ఈ కేశోరాం సిమెంట్‌ను ఆదిత్యా బిర్లా గ్రూపు కొనుగోలు చేయడంతో ఇక నుంచి ఈ ప్లాంట్‌లో అల్ట్రాటెక్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శనివారం ఈ యూనిట్‌లో కార్మికులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి, అధికారికంగా అల్ట్రాటెక్ లోగోను ఆవిష్కరించారు.

మందమర్రి ఎస్ఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మందమర్రి జీఎంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మందమర్రి, మార్చి 1: సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జీ.దేవేందర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ సింగరేణి గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ శనివారం నాయకులతో కలిసి మందమర్రి ఎస్ఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. తాను గత నెల 28న కార్మికుడి సమస్య పై మాట్లాడేందుకు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం దేవేందర్‌ను కలిసినట్లు లిపారు. యూనియర్ కార్యదర్శిగా పని చేస్తూనే కాసీపేట గనిలో ఎస్‌డీఎల్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నానని చెప్పారు. ఏరియాలోని శాంతిఖనిలో పోస్టింగ్ ఇచ్చిన ఉద్యోగిని అక్కడి నుంచి కాసిపేట-1 లేదా కాసిపేట-2 గనికి బదిలీ చేయాలని విన్నవించినట్లు తెలిపారు. దీనిపై ఇందుకు 'జీఎం నాకు ఇదే పనా వేరే పని లేదా గనులను నువ్వే నడుపు' అని అనేక మార్లు అని ఇక్కడి నుంచి బయటకు వెళ్లు నేను బదిలీ చెయ్యను అని అవమానకరంగా మాట్లాడి కించపరిచాడని పేర్కొన్నారు. ఆ సమయంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ కూడా తనవెంట ఉన్నాడని ఆయన తెలిపారు. తాను దళితుడినని అవమానపరచిన జీఎం పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ విషయం పై ఎస్ఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా జీఎంపై వచ్చిన ఫిర్యాదు పై విచారణ జరిపి తదుపరి చర్యలు చేపడతామన్నారు. దీని పై జీఎం దేవేందర్ వివరణ కోరగా ఏఐటీయూసీ నాయకుడు మల్లేశ్ కార్మికుని బదిలీ చేయాలని తన వద్దకు వచ్చాడని అది ఇప్పుడు సాధ్యం కాదని తర్వాత ఆలోచిస్తానని తెలిపారు.

జీఎంపై ఏసీపీకి ఫిర్యాదు

బెల్లంపల్లి, మార్చి 1 : మందమర్రి ఏరియా జీఎం దేవేందర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ కోరారు. ఈ మేరకు శనివారం రాత్రి బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈనెల 28న జీఎం కార్యాలయానికి కార్మిక సమస్య విన్నవించడానికి వెళ్లినప్పుడు జీఎం దేవేందర్ తనపై దురుసుగా మాట్లాడాడని ఆరోపించారు. అవమానించడమే కాకుండా కించపరుస్తూ అసభ్యపదజాలంతో దూషించారని తెలిపారు. వెంటనే జీఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల డీఈవో యాదయ్య

మంచిర్యాలటౌన్, మార్చి 1 : ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో యాదయ్య సూచించారు. శనివారం మంచిర్యాలలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై మండల విద్యాధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ ఈ యేడాది పదో తరగతి పరీక్షలకు ఏడు పేపర్లు ఉంటాయని, ఆన్సర్ షీట్లు 24, 12 పేజీల బుక్‌లెట్ల రూపంలో ఉంటాయని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, అన్ని సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ పరీక్షల అధికారి దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు .

మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ఫిబ్రవరిలో ఉత్పత్తి 111 శాతం

- శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటి వరకు 185 కోట్ల లాభాలు
- జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మార్చి 1 : శ్రీరాంపూర్ ఏరియాలో ఫిబ్రవరి నెలలో 111 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని, 11 నెలల్లో 86 శాతం ఉత్పత్తి సాధించామని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జీఎం ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎం మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో 11 నెలల్లో 185 కోట్లు లాభాలు గడించినట్లు పేర్కొన్నా. భూగర్భ గనుల్లో నష్టాలను ఓసీపీల ద్వారా పూడ్చుకుంటున్నట్లు వివరించారు. ఫిబ్రవరి నెలలో 53,0500 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 59,0533 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. ఇదే సమయానికి గతేడాది ఉత్పత్తి కంటే 28472 టన్నులు బొగ్గు అదనంగా సాధించామని చెప్పారు. శ్రీరాంపూర్ ఓసీపీలో 146 శాతం, ఇందారం ఓసీపీలో 60 శాతం బొగ్గు సాధించినట్లు పేర్కొన్నారు. ఆర్కె 5లో 102 శాతం, ఆర్కే6లో 104 శాతం, ఆర్కే 7లో 84 శాతం, ఆర్కేన్యూటెక్‌లో 112 శాతం, ఎస్ఆర్పీ 1లో 73 శాతం, ఎస్ఆర్పీ 3లో 81 శాతం, ఐకే 1ఏలో 78 శాతంతో భూగర్భ గనుల్లో 90 శాతం ఓసీపీల్లో 118 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. గత 11 నెలల్లో శ్రీరాంపూర్ గనులు, ఓసీపీల్లో 86 శాతం బొగ్గు ఉత్పత్తి తీసినట్లు తెలిపారు. ఓసీపీల్లో మట్టి తవ్వకాలు రవాణా లక్ష్యాలు పూర్తి స్థాయిలో జగనందునే ఉత్పత్తి వెనకంజలో ఉన్నదన్నారు. మిగిలిన 30 రోజుల్లో ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. రానున్న రోజుల్లో ఉత్పత్తి సాధనకు ఓసీపీల్లో 4 షవల్స్, 20 ట్రక్కులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ నేడాది మే, జూన్ వరకు ఆర్కే 6గని మూసి వేస్తామని, అందులోని కార్మికులను ఇక్కడే సర్దుబాటు చేస్తామని పేర్కొన్నారు.

సింగరేణిలో 11 నెలల్లో..

సింగరేణి సంస్థ గడిచిన 11 నెలల్లో 93 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. కొత్తగూడెంలో 96 శాతం, ఇల్లందులో 110 శాతం, మణుగూరులో 97 శాతం, బెల్లంపల్లిలో 95 శాతం, మందమర్రిలో 77 శాతం, శ్రీరాంపూర్‌లో 86 శాతం, ఆర్జీ-1లో 94 శాతం, ఆర్జీ-2లో 94 శాతం, ఆర్జీ-3లో 98 శాతం, ఆడ్రియాలలో 101 శాతం, భూపాలపల్లి ఏరియాలో 74 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఉద్యోగులు శాప్‌లో వారి కుటుంబ వివరాలు, కుటుంబ సభ్యుల పోటోలను అప్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పర్సనల్ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్వోటూజీఎం సత్యనారాయణ, ఏజీఎం మురళీధర్, డీవైజీఎంలు అరవిందరావు, చిరంజీవులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 114శాతం ..

రెబ్బెన, మార్చి 1: బెల్లంపల్లి ఏరియా గనుల్లో ఫిబ్రవరి మాసంలో 114 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో గోలేటిలోని జీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి మాసానికి సంబంధించిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత వివరాలు వెల్లడించారు. ఏరియా లోని ఖైర్‌గూడ ఓసీపీలో 3.10 లక్షల టన్నులకు గాను 132 శాతంతో 4.09 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించనట్లు తెలిపారు. గోలేటి ఓసీపీ 0.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా బొగ్గు ఉత్పత్తి తీయలేదని తెలిపారు. ఏరియాలో ఫిబ్రవరిలో 3.60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 114 శాతంతో 4.09 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. వార్షిక ఉత్పత్తి పరంగా చుస్తే ఏప్రిల్ 2024 నుంచి ఫిబ్రవరి 2025 వరకు 33.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 95శాతంతో 32.07 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఏరియాకు సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 38.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు జీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్వోటూజీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్ ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్

బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి

బదిలీపై వెళ్తున్న ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్‌ను సన్మానిస్తున్న జీఎం

బదిలీపై వెళ్తున్న ఫైనాన్స్ ఏజీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 1 : శ్రీరాంపూర్ ఏరియా ఏజీఎం ఫైనాన్స్‌గా పని చేసి బదిలీపై ఎస్‌టీపీపీకి వెలుతున్న ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్‌ను జీఎం ఎం శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. జీఎం ఆఫీస్‌లో జరిగిన సన్మాన సభలో జీఎం ఏజీఎం మురళీదర్‌ను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం ఎన్ సత్యనారాయణ, డీవైజీఎం పి అరవింద రావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు కే రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీవైజీఎం చిరంజీవులు, సివిల్ ఆనంద్ కుమార్, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, వివిధ గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లివాసికి పీహెచ్‌డీ పట్టా

శంకరజ్యోతి

బెల్లంపల్లి, మార్చి 1 : పట్టణంలోని కన్నాల బస్తీకి చెందిన శంకరజ్యోతికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీలో పరిశోధనా పత్రానికి పట్టా లభించింది. ఖమ్మం జిల్లాలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న శంకరజ్యోతికి గణితంలో ఏ స్టడీ ఆన్ రెగ్యులర్ డామినేషన్ ఇన్ లిటాక్ట్ గ్రాఫ్స్ అంశంపై పరిశోధన పత్రం సమర్పించింది. ఇందులో ఆమెకు పట్టా దక్కింది. బెల్లంపల్లిలోనే పది, ఇంటర్ చేసిన ఆమె డిగ్రీ మంచిర్యాల, పీజీ హైదరాబాద్‌లో చేసింది. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలోని కన్నాల బస్తీకి చెందిన జీ పద్మావతి సోమిరెడ్డి దంపతుల కుమార్తె శంకరజ్యోతికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్ డీ పట్టా లభించింది. గణితంలో ఇబ్బందులు పడే వారికి సులభంగా అర్థమయ్యేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పీహెచ్ డీ పూర్తి చేసినట్లు శంకరజ్యోతి తెలిపారు. సహాయ సహకారాలు అందించిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు , కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 1: కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకనంద డిగ్రీ కళాశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలను, స్వీట్‌లను తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుక్, విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి ఏఐటీయూసీ వినతి

శ్రీరాంపూర్, మార్చి 1 : సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ, అధ్యక్షులు బుర్ర తిరుపతి సీఎండీ బలరామ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించే వరకు జీవో నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికుల, వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, మైన్స్ యాక్ట్ ప్రకారం ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి పండుగ సెలవులు, లీవులు, సిక్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాగాల పేరిట కార్మికుల వద్ద నుంచి కాంట్రాక్టర్లు వసూలు చేస్తున్న పెనాల్టీ సిస్టం వెంటనే రద్దు చేయాలని, ఓపెన్ కాస్టలలో పనిచేసే డ్రైవర్లను వోల్వో ఆపరేటర్లుగా గుర్తించి హై స్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. సింగరేణి కార్మికులకు చెల్లించే విధంగా అలవెన్సను కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాలని, ఓవర్ టైం అలవెన్స్, ఆదివారం డ్యూటీ చేస్తే అదనంగా వేతనం చెల్లించాలని కోరారు. ఓపెన్ కాస్ట్‌లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కొందరు కాంట్రాక్టర్లు టెండర్లో ఉన్న కార్మికుల కంటే అదనంగా కార్మికులను తీసుకొని వారి వద్ద నుండి డబ్బులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెమి స్కిల్డ్, స్కిల్డ్ మరియు హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ వినతిపై సీఎండీ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

సీఎండీకి వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు